క్లుప్తంగా

కలిగోట చెక్‌పోస్టు ఎత్తివేత

కథలాపూర్: జిల్లా సరిహద్దులో కలిగోట శివారులో ఎన్నికల కోసం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తాత్కాలికంగా ఎత్తివేశారు. రాష్ట్రంలో ఈనెల 18న అధికారికంగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అదేరోజు నుంచి కలిగోటలో తిరిగి చెక్‌పోస్టును ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. కాగా కలిగోట చెక్‌పోస్టుకు సమీపంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ఉండటం విశేషం.

సర్టిఫికెట్ల ప్రదానం



శివనాదంకు సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో భవాని కిరాణ దుకాణంలో నాణ్యమైన సరుకుల విక్రయాలు చేస్తున్నందున నిర్వాహకుడు ద్యావరశెట్టి శివనాదంకు నేషనల్ షాపూల్ సర్వే అధికారులు గురువారం సర్టిఫికెట్ అందజేశారు. అధికారులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా షాపులు నిర్వహిస్తున్న వాటిని కొంతకాలంగా గమనిస్తూ నాణ్యమైన సరుకులను ప్రజలకు అందజేస్తున్న వారిని గుర్తించి సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు తెలిపారు.

కొడిమ్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం



కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలో పర్మినెంట్ వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం తెలిపారు. మండల కేంద్రంలోని ఎల్లంపెల్లి పంప్‌హౌస్ ప్రాంతంలో ఉన్న స్థలాన్ని గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. చదును చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ముత్యం శంకర్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులున్నారు.

నెరవేరని హామీలతో మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

కథలాపూర్: ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, పార్లమెంట్ ఎన్నికల వేళ మళ్లీ దొంగ హామీలతో ప్రజల ముందుకొస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా కింద రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2,500 ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. సిరికొండ- తక్కళ్లపెల్లి బ్రిడ్జిని ఎప్పుడు పూర్తిచేస్తారో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలపాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, తెడ్డు మహేశ్, భూమేశ్, ప్రమోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చర్చకు రమ్మంటే చేతకాని బీజేపీ, బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న గోగూరి మహిపాల్‌రెడ్డి

కొండగట్టు(చొప్పదండి): కరీంనగర్ అభివృద్ధిపై చర్చకు రమ్మంటే చేతకాని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మాటలతో దాడి చేయడం విడ్డూరంగా ఉందని పీసీసీ సభ్యుడు గోగూరి మహిపాల్‌రెడ్డి అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పొన్నం కీలక పాత్ర పోషించారని, బుధవారం కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని ఎన్నికల ప్రచారం ప్రారంభించిన తరుణంలో మంత్రిపై బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.



రాయికల్: ఈద్గా వద్ద..



కోరుట్ల/కోరుట్లరూరల్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

• ఘనంగా రంజాన్ వేడుకలు

జగిత్యాలరూరల్/సారంగాపూర్/మెట్‌పల్లి/మేడిపల్లి/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/మల్యాల/కథలాపూర్/కోరుట్ల/కోరుట్లరూరల్/పెగడపల్లి/రాయికల్: ముస్లింలు పవిత్ర రంజాన్ పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. మాసం రోజులుగా పవిత్ర ఉపవాసాలను ఆచరించి ఉపవాస దీక్షలను విరమించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానంలో వందలాది సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. మత గురువులు మహ్మద్ ప్రవక్త సందేశాన్నందించారు. రంజాన్ విశిష్టతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



జగిత్యాలరూరల్: చల్‌గల్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇబ్రహీంపట్నంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





సారంగాపూర్ మసీదులో.., మెట్‌పల్లి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



పెగడపల్లిలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



మల్యాలలో..



మేడిపల్లి: పోరుమల్లలో ఈద్గా వద్ద..



మల్లాపూర్: రేగుంటలో మైనార్టీ నాయకుడు ఎండీ జాఫర్ ఇచ్చిన తేనీటి విందులో పాల్గొన్న పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు

కమ్ముకొస్తున్న మబ్బులు..

- ఆందోళనలో రైతులు
- మొదలు కాని ధాన్యం తూకాలు
- ప్రారంభించాలని కోరుతున్న అన్నదాతలు



పెగడపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

పెగడపల్లి: మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. మూడు, నాలుగు రోజులుపాటు వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల వల్ల ఆకాశం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుంటుండంతో రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మండలంలో సుమారు 27వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. యాసంగిలో సాగయిన వరి కోతకు సిద్ధంగా ఉంది. కొందరు రైతులు ఇప్పటికే కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కేంద్రాల్లో ధాన్యం తూకం చేయడం ప్రారంభించకపోవడంతో కుప్పలుతెప్పలుగా పేరుకుపోతోంది. మరోవైపు ధాన్యం తెచ్చేందుకు కేంద్రాల్లో స్థలాల కొరత కూడా నెలకొంది. మండల వ్యాప్తంగా సుమారు 3.50లక్షల క్వింటాళ్ల ధాన్యం తరలివచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. మండలంలోని 23 గ్రామాల్లో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 25 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నింటిని ప్రారంభించారు. అయితే కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా.. తూకం చేయడంలో జరుగుతున్న జాప్యం వల్ల కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే 30 శాతం మంది రైతులు వరి నూర్పిడి చేసి ధాన్యాన్ని గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించారు. వర్షాలు పడితే కోలుకోని విధంగా భారీ నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే దశలో వీటి ప్రభావం ఉండటంతో నష్టం కూడా అధికంగానే జరుగుతుంది. అప్పులపాలయ్యే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

వాన పడితే అన్నమో రామచంద్రనే..

ప్రస్తుత పరిస్థితుల్లో వర్షం వస్తే అన్నదాతకు నష్టం తప్పదు. మండలంలో ఎస్సారెస్పీ నీటికి తోడు వ్యవసాయ బావుల నీటి ఆధారంగా అష్టకష్టాలు పడి పంటలు సాగు చేశారు. తీరా సమయానికి వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గి పెట్టిన పెట్టుబడులు వస్తాయో లేదోనన్న బెంగ రైతులను వెంటాడుతోంది. వానాకాలంలో సాగయిన వరి పైరుపై దోమపోటు సోకి దిగుబడి తగ్గి నష్టాలకు లోనయ్యారు. యాసంగిలో సాగు చేసిన వరి పంటలపై ఎకరాకు సుమారు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు పెట్టుబడులు పెట్టామని రైతులు చెబుతున్నారు. పక్షం రోజులు వాతావరణం అనుకూలిస్తే కోతలు పూర్తయి పైకం చేతికందనుంది. అకాల వర్షం వస్తే మాత్రం.. పూర్తిస్థాయిలో నష్టపోక తప్పదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ యాసంగిలో 27వేల ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. పక్షం రోజులు గడిస్తేనే వరి పంట పూర్తిస్థాయిలో చేతికచ్చే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఆకాశంలో కమ్ముకొస్తున్న మబ్బులు రైతును ఒక్కచోట నిలువనీయడం లేదు. ఇప్పుడు గనుక గాలితో కూడిన వర్షం వస్తే పంటంతా నేలవాలి కోయడానికి వీల్లేకుండా పోతుంది. వర్షం పడ్డట్లయితే త్వరగా కోత కోసుకునే పరిస్థితే ఉండదు. పంటంతా పూర్తిగా నీటిలో మునిగి భారీగా నష్టం వాటిల్లే అవకాశముంది.

మబ్బులు భయపెడుతున్నయ్



మూడెకరాల్లో వరి సాగు చేత్తన్న. పొలం కోసి వడ్లు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. పొద్దంతా ఎండబోసి రాత్రి కుప్పలపై కవర్లు కప్పుతున్న. వర్షం భయానికి రాత్రి నిద్ర పడతలేదు. వడ్ల కుప్పల కాడనే కావలి ఉండాల్సి అత్తంది. ధాన్యం కొనుగోలు విషయంలో నిబంధనలు సడలించాలె.

– గంగనాయక్, ఏడుమోటలపల్లి

ధాన్యం తడిస్తే ఇబ్బంది



కేంద్రాల్లో ధాన్యం తూకం వెంటనే ప్రారంభించాలి. పది రోజులుగా రైతులు కేంద్రాల్లో ధాన్యం కుప్పలతో పాట్లు పడుతున్నారు. వడ్లను కొనుగోలు కేంద్రానికి తెచ్చిన రైతులు తూకం కోసం ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని వెంటనే నిర్వాహకులు ధాన్యం తూకం ప్రారంభించాలి.

– కాటం నర్సింహారెడ్డి, పెగడపల్లి



అపూర్వ సమ్మేళనం

కథలాపూర్: కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 2000–01 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఆడుతూపాడుతూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. సామూహికంగా భోజనాలు చేశారు.

అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మల్లాపూర్: అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర నాయకుడు ఎర్ర రమేశ్ గురువారం అన్నారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ నిధులతో అంబేడ్కర్ విగ్రహాలకు రంగులు వేయించి జయంతి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

గల్ఫ్ కార్మికుల మద్దతు బీజేపీకే..

మల్లాపూర్: గల్ఫ్ వెళ్లిన కార్మికులు, వారి కుటుంబాల మద్దతు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీకేనని గల్ఫ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు పెనుకుల అశోక్ అన్నారు. గురువారం దుబాయిలోని గల్ఫ్ కార్మిక సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. మోదీ పాలనలో వివిధ దేశాల్లో ఉన్న భారతీయులందరికీ సముచిత గౌరవం దక్కుతోందన్నారు. 15లక్షల గల్ఫ్ కార్మికుల వెతలను గతంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు మణికంఠ, రాంచరణ్, సంగేశ్వర్, మనీ, కొమురం నరేష్ పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు నివాళి



మెట్‌పల్లి: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తదితరులు



కథలాపూర్‌లో పాల్గొన్న నాయకులు



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: జిల్లావ్యాప్తంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కోరుట్ల పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చెన్నా విశ్వనాథం, రాస భూమయ్య, చింతకింది శంకర్, పాతర్ల విజయ్, పేట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవినాయక్, మాజీ ఉప సర్పంచ్ స్వామి, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజం, సత్యనారాయణరెడ్డి, గంగాధర్, రాజరత్నం, సాగర్, దుర్గప్రసాద్, మల్లేశం, లక్ష్మణ్, సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వర్షకొండ గ్రామంలో బస్టాండ్ వద్ద పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు తుక్కరాం, గుజ్జెరి ప్రకాశ్, లింగారెడ్డి, శంకర్, అజయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, నాయకులు దొప్పల జలందర్, కాశవత్తుల లక్ష్మిరాజం, గాంధారి శ్రీనివాస్, మిట్టపెల్లి కిషన్, తెడ్డు శేఖర్, గట్ల కృష్ణ, సత్యనారాయణగౌడ్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సిరిపురం రాజేశ్ అన్నారు. మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముష్కరి సురేందర్, పుప్పాల మహేశ్, లవంగ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న పూలే విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ఏర్పాటు చేశారు. గురువారం విగ్రహాలను ఆవిష్కరించారు. బోయిని సత్యం, ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సిరిపురం రాజేశ్ తదితరులు



ఇబ్రహీంపట్నం: వర్షకొండలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు



కోరుట్ల: నివాళి అర్పిస్తున్న నాయకులు



బండలింగాపూర్‌లో విగ్రహాల ఏర్పాటు



పిచ్చుకల సందడి..

జగిత్యాలరూరల్: పిచ్చుకలు వాతావరణంలో మార్పులతో అరుదుగా కన్పిస్తున్నాయి. కానీ గురువారం ఉదయం పొరండ్ల గ్రామ శివారులో విద్యుత్ తీగలపై వందలాది పిచ్చుకలు కనిపించి చూపరులను ఆకట్టుకున్నాయి.

కేంద్ర పథకాలపై ప్రచారం



కొల్వాయిలో పథకాలపై ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో శక్తివందన్ కార్యక్రమం పేరుతో బీజేపీ నాయకులు బీజేపీ అమలు చేసిన పథకాలపై గురువారం ఉపాధిహామీ కూలీలను కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అరవింద్‌కు ఓటెయ్యాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు పాత పద్మ, మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, బీజేపీ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య, నాయకులు గంగాధరి సంతోష్, గర్షకుర్తి రమేశ్, పాత రమేశ్, కస్తూరి అక్షిత్, పెండ్యాల ప్రతాప్, మెండు అజయ్ తదితరులున్నారు.

జగిత్యాలరూరల్: కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి గ్రామంలో శక్తివందన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీడీ కార్మికులతో కలిసి మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై సమీక్షించారు. అర్బన్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సాంబారి కళావతి, అర్బన్ మండల ఇన్‌చార్జి జున్ను రాజేందర్, నాయకులు రాజిరెడ్డి, మోహన్, రాజేశ్ పాల్గొన్నారు.